తుంపర సేద్యం.. మెట్ట రైతుకు లాభం

- సూక్ష్మ, తుంపర సేద్యంతో సాగునీరు, శ్రమ ఆదా
- డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు
- ఆరుతడి పంటలకు డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకం పై రైతుల ఆసక్తి

రంగారెడ్డి జిల్లాలో డ్రిప్ విధానంలో సాగవుతున్న పంట

న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ : వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పోకడలను రైతులు అనుకరిస్తున్నారు. సులభ పద్ధతిలో వ్యవసాయ చేయడం, తక్కువ ఖర్చు, శ్రమతో ఎక్కువ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు చేసుకునేందుకు సూక్ష్మ, తుంపర సేద్యం ఎంతో దోహదపడుతుంది. సాగునీటి ఎద్దడి ఉండే మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం ద్వారా రైతులు అధిక లాభాలను అర్జించే అవకాశం ఉంది. రైతులను తుంపర సేద్యం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం కూడా సబ్సిడీలు ఇచ్చి అందుకు సంబంధించిన పరికరాలను అందిస్తోంది. ఆరుతడి పంటలైన వేరుశనగ, శనగ, మొక్క జొన్న, బబ్బెర, కందులు, పెసర, పత్తి, పలు కూరగాయలు, ఆకుకూర పంటలను తుంపర సేద్యం ద్వారా విరివిగా పండించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. తుంపర సేద్యం డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకం ముఖ్యమైనవిగా చెప్పొచ్చు. డ్రిప్ విధానంలో పంటలోని ప్రతి సాలుకు సన్నని పైపు అమర్చి ఒక్కో చుక్క నీరు మొక్క మొదలులో పడేలా చేయడం, స్ప్రింక్లర్ల విధానంలో పంటలో పెద్ద పైపులు వేసి స్ప్రింక్లర్ హెడ్ ద్వారా నీటిని విరజిమ్మి పంటకు నీరందించడం జరుగుతుంది.

బిందు, తుంపర సేద్యం వల్ల కలిగే లాభాలు

- తుంపర సేద్యం విధానంలో పంట పొలంలో పొలం గట్లు, కాల్వలు, మడులు చేయాల్సిన అవసరం ఉండదు. దీంతో రైతుకు ఉన్న భూమి విస్తీర్ణం మొత్తం పంట సాగు చేయవచ్చు.
- సంప్రదాయ నీటి పారకం విధానంతో పొలం గట్లు, కాల్వ గట్లకు సుమారు 35శాతం నీరు వృథాగా పోతుంది. స్ప్రింక్లర్ల వాడకంలో ఈ నష్టం ఏమాత్రం ఉండదు.
- రైతు సాగు చేసిన పంటకు నీటిని తరచూ అవసరమైన పరిమాణంలో ఇవ్వడం వల్ల పంట ఏపుగా పెరిగి దిగుబడులు కూడా సాధారణం కంటే 5 నుంచి 20 శాతం వరకు అదనంగా వస్తాయి.
- స్ప్రింక్లర్ పద్ధతి ద్వారా భూమి లోపలి పొరల్లోకి నీరు వెళ్లకుండా మొక్కల వేళ్ల వరకే వెళ్లి మొక్కకు కావాల్సిన నీరు అందుతుంది. ముఖ్యంగా ఇసుక నేలల్లో ఈ పద్ధతి రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది.
- మొక్కలకు అవసరమైన నీటిని ఎక్కువసార్లు తక్కువ మోతాదులో ఇవ్వొచ్చు.
- స్ప్రింక్లర్ల నుంచి వెలువడే మృదువైన నీటి తుంపర్ల వల్ల భూమిపై నీరు నిల్వ ఉండదు, మట్టి గడ్డ కట్టదు. అవసరమైన నిష్పత్తిలో నీరు, గాలి భూమిలో ఉంటూ విత్తనాలు ఆరోగ్యంగా మొలకెత్తి పంట దిగుబడి కూడా పెరుగుతుంది.
- తుంపర సేద్యం ద్వారా ఎగుడు, దిగుడుగా ఉన్న నేలల్లోనూ పంటలు పండించొచ్చు.
- స్ప్రింక్లర్ ద్వారా నీరు వర్షంలా పడటంతో పంట చుట్టుపక్కల వాతావరణం చల్లగా మారి అధిక ఉష్ణోగ్రతల నుంచి పంటను కాపాడుకోవచ్చు.
- డ్రిప్ సిస్టం ద్వారా పలు రకాల పండ్లతోటలను విరివిగా పెంచుకునే అవకాశం ఉంది.
- బిందు సేద్యం(డ్రిప్) వల్ల 30 నుంచి 40 శాతం కరెంట్, 30 నుంచి 40 శాతం ఎరువులు ఆదా అవుతాయి.
- ఎత్తు పల్లాలు ఉన్న భూముల్లోనూ అన్ని మొక్కలకు ఒకే మోతాదులో నీరు అందడం వల్ల పంట ఏపుగా పెరుగుతుంది.
- బిందుసేద్యంతో భూమి కోతకు గురికాకుండా, భూసారం కోల్పోకుండా, పంటకు చీడపీడలు రాకుండా ఉంటుంది.

స్ప్రింక్లర్ల అమరికలో మూడు విధానాలు

స్ప్రింక్లర్లను మూడు విధాలుగా పంట పొలాల్లో అమర్చుకునే అవకాశం ఉంది. శాశ్వతంగా పైపులను భూమిలో పాతిపెట్టి స్ప్రింక్లర్ హెడ్‌లను అమర్చి నీటిని విరజిమ్మడం మొదటి విధానం అయితే కొన్ని పైపులను మాత్రం భూమి లోపల ఉంచి మిగతా పరికరాలను బయట ఉంచి మొక్కలన్నింటికీ తుంపర్లు పడేలా అమర్చుకోవడం రెండో విధానం. ఇక స్ప్రింక్లర్ పైపులన్నీ భూమిపైనే ఉంచి పంటకు నీరందించడం మూడో విధానంగా చెప్పొచ్చు. ఈ విధానం ద్వారా పైపులను ఒకచోట నుంచి మరో చోటికి తరలించి వీలైనన్నీ పంటలకు తుంపరసేద్యం ద్వారా నీరందించేందుకు వీలవుతుంది. స్ప్రింక్లర్‌లో ముఖ్యమైనది స్ప్రింక్లర్ హెడ్. ఇందులో రెండు రంధ్రాలు ఉంటాయి. ఒకటి 4 నుంచి 5.6మిల్లీమీటర్ల సైజు ఉండగా ఇంకోటి 3.13 మిల్లీమీటర్ల సైజు ఉంటుంది. ఎక్కువ పీడనం గల స్ప్రింక్లర్ సుమారు 35 మీటర్ల వ్యాసం కలిగిన భూమిని తడుపుతుంది. తక్కువ పీడనం గల స్ప్రింక్లర్ 30మీటర్ల వ్యాసం గల భూమిని మాత్రమే తడుపుతుంది.

తక్కువ ఖర్చుతోనే స్ప్రింక్లర్ల ఏర్పాటు

తుంపర సేద్యంలో భాగంగా స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు ఖర్చు కూడా తక్కువే అని చెప్పొచ్చు. ఎకరం భూమిలో పంట సాగు కోసం స్ప్రింక్లర్ల పైపులు కొనుగోలు చేసేందుకు రూ.5వేల నుంచి రూ.5,600ల వరకు ఖర్చవుతుంది. రెండు ఎకరాలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు, మూడు ఎకరాలకు రూ.9వేల నుంచి రూ.10వేల వరకు, నాలుగు ఎకరాలకు రూ.11వేల నుంచి రూ.12వేల వరకు ఖర్చవుతుంది. పైపుల సైజులను బట్టి ఖర్చులోనూ తేడాలు ఉంటాయి. అయితే రైతులు కొనుగోలు చేసిన స్ప్రింక్లర్ పైపులు, హెడ్ వాల్వ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటే ఎక్కువ రోజులు ఎలాంటి అవాంతరం లేకుండా పంటలను నీటిని అందించవచ్చు. స్ప్రింక్లర్లలో ఇంపాక్ట్ స్ప్రింక్లర్లు, మైక్రో స్ప్రింక్లర్స్, పార్ట్ సర్కిల్ స్ప్రింక్లర్స్, పర్‌ఫోరేటెడ్ పైపులు, జెట్ స్ప్రింక్లర్స్, పాపప్ స్ప్రింకర్స్, రెగ్యులేటెడ్ స్ప్రింక్లర్స్ తదితర రకాలు ఉంటాయి.

సులభ పద్ధతుల్లో దిగుబడులు పెంచుకోవాలి

రైతులు తక్కువ శ్రమ, తక్కువ సాగునీటి వినియోగం లాంటి సులభ పద్ధతుల్లో పంటలు సాగు చేసి దిగుబడులు పెంచుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా పంటకు సరిపడా నీటిని అందించడంతో పాటు శ్రమ, సమయం కలిసొస్తుంది. పంటకు స్ప్రింక్లర్లను అమర్చి కొంత సమయాన్ని ఇతర పనులకు కేటాయించుకునే అవకాశం ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉన్న డ్రిప్,స్ప్రింక్లర్లను ఆరుతడి పంటల సాగు కోసం రైతులు ఏర్పాటు చేసుకొని అధిక దిగుబడులు సాధించాలి.

శివారు.. కొత్త హుషారు

- న్యూ ఇయర్ వేడుకలకు సన్నాహాలు
- రిసార్టులు బుక్.. గెస్ట్ హౌస్‌లు ఫుల్
- కుటుంబసభ్యులతో కలిసి కొందరు, స్నేహితులతో కలిసి ఇంకొందరు
- ఉత్సాహంగా వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు

వదినమ్మా అంతా రెడీ కదా. త్వరగా వచ్చేయండి. ఉదయమే వెళ్లిపోదాం. తినే వస్తువులు ఏమీ పట్టుకురావొద్దు. అంతా అక్కడే రిసార్టును బుక్ చేసుకున్న ఓ ఉమ్మడి కుటుంబంలోని ఆడపడుచు మాట ఇది.

బ్రో మధ్యాహ్నంలోపే అక్కడకు చేరుకోవాలి. అర్ధరాత్రి దాకా ఇగ ధూంధామే. ఎక్కడా తగ్గేదేలే ఓ గెస్ట్‌హౌస్‌ను బుక్ చేసుకున్న ఓ స్నేహితుడి ఉత్సాహం ఇది.

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 30 : ఒక్కరేంటి.. 2023 సంవత్సరానికి ఘనంగా ముగింపు పలికేందుకు అంతా సిద్ధమవుతున్నారు. రెట్టించిన ఉత్సాహంతో కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఈ ఏడాది చివరి రోజును అంతా కలిసి సందడిగా సాగనంపాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం హైదరాబాద్ శివారులోని ఫాంహౌస్‌లు, గెస్ట్‌హౌస్‌లు, రిసార్టులను వేదికగా చేసుకుంటున్నారు. పేరుగాంచిన రిసార్టులు ఇప్పటికే బుక్ అయిపోగా.. చిన్నాచితక గెస్ట్‌హౌస్‌లు, ఫాంహౌస్‌లకు సైతం మస్తు డిమాండ్ ఉన్నది.

టిఫిన్ మొదలు డిన్నర్ వరకు..

నగర శివారులోని పలు ఫాంహౌస్‌లు, రిసార్టులను 24 గంటలకోసం ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు బుకింగ్ చేసుకొంటున్నారు. ఉదయం టిఫిన్ మొదలు మధ్యాహ్నం లంచ్, సాయంత్రం స్నాక్స్, రాత్రికి డిన్నర్ వరకు విభిన్నమైన ఆహార పదార్థాలతో విందులు ఆరగించేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ఇందుకోసం ఒక్కొక్క రు రూ.4 వేల నుంచి 6 వేల వరకు వెచ్చించనున్నారు. ఆయా రిసార్టుల్లో డీజేలతోపాటు స్విమ్మింగ్‌పూల్, ఆటలు ఆడుకునేందుకు అనువైన వసతులు కల్పిస్తున్నారు. కొన్ని రిసార్టులు పాస్‌లు కూడా జారీ చేశాయి. కల్పిస్తున్న వసతులు, అందిస్తున్న ఆహార పదార్థాలు, మద్యం తదితరాలను బట్టి రిసార్టులు పాస్‌లు జారీచేస్తున్నాయి. ఒక్కో పాస్‌ను రూ.4 వేల నుంచి 6 వేల వరకు విక్రయించాయి. అక్కడ ఆహార పదార్థాల విషయంలో కొన్ని పరిమితులతో కొన్ని చోట్ల రూ.2 వేల వరకే వసూ లు చేస్తున్నాయి. కుటుంబసభ్యులు, స్నేహితులు ఏడాది చివరి రోజు ను సంతోషంగా గడిపేందుకు ఆసక్తి చూపుతున్నా రు. అది మరిచిపోలేని రోజుగా మిగిలిపోయేలా ప్లాన్ చేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆడిపాడాలని నిర్ణయించుకున్నారు. చిన్న పాటి డీజేలు ఏర్పాటుచేసుకుని ధూంధాం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రత్యేక ఈవెంట్లు ఏర్పాటుచేస్తున్నారు. అయితే, పలుచోట్ల ఫాంహౌస్‌లు రోజుకు రూ.12 వేల నుంచి 20 వేల వరకు వసూలు చేస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా వాటిలో అన్ని వసతులు కల్పిస్తున్నాయి. స్విమ్మింగ్ పూల్, గార్డెన్, ప్లే ఏరియాతో పాటు కిచెన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి.చాలా మంది ఇలాంటి ఫాంహౌస్‌లు తీసుకొనేందుకు ఆసక్తి చూపారు. అంతా కలిసి ఇష్టం వచ్చిన ఆహార పదార్థాలను స్వయంగా వండుకుని తినేలా ప్లాన్ చేసుకుంటున్నారు. అందుకు అవసరమైన వస్తువులను సిద్ధం చేసుకుంటున్నారు.

రోడ్ ట్రిప్స్

ఇటీవల రోడ్ ట్రిప్పులకు డిమాండ్ పెరిగింది. కొందరు కుటుంబసభ్యులు, స్నేహితులు ఇండ్లకు దూరంగా న్యూఇయర్‌ను జరుపుకొనేందుకు ఇష్టపడుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక వాహనాలు బుక్ చేసుకుంటున్నారు. కొందరు శ్రీశైలం వంటి ఆధ్యాత్మిక క్షేత్రాల వైపు వెళ్తుండగా.. ఎక్కువ మంది నీటి అందాలను వీక్షించేందుకు వీలుగా జల వనరు లు అధికంగా ఉండే ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. 'మేం 20 మందిమి కలిసి నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిల వెళ్తున్నాం. ఆదివారం ఉదయమే బయలుదేరి సోమవారం సాయంత్రం వరకు అక్కడే ఉంటాం' అని రోడ్ ట్రిప్ ప్లాన్ చేసుకున్న ఓ యువతి తెలిపింది. ఒక్కొక్కరికీ భోజనాలతో కలిపి రూ.5వేలు వేసుకుంటున్నట్లు చెప్పింది.

అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో..

అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో 2023 సంవత్సరానికి వేడుకగా వీడ్కోలు పలికేందుకు సిద్ధమవుతున్నారు. కేక్‌లు కోయడం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఆసక్తి చూపుతున్నారు. గేటెడ్ కమ్యూనిటీల్లోని పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమా లు, ఆటపాటలకు అనువగా డీజేలు ఏర్పాటుచేస్తున్నారు. భారీగా పటాకులు కాల్చి కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికేలా ప్లాన్ చేస్తున్నారు.

నగర శివారులోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహణ (ఫైల్)

యాచారంలో సాగర్ దారిలో ఇరువైపులా నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్ జంఝాటం

- యాచారంలో ట్రాఫికర్
- రోడ్లపై ఇష్టానుసారంగా ప్రైవేట్ వాహనాల పార్కింగ్
- ఇబ్బందుల్లో పాదచారులు, వాహన చోదకులు
- ట్రాఫిక్ అధికారులు స్పందించాలని విన్నపం

రోడ్డుపై నిలిపిన కార్లు, బైక్‌లు

యాచారం, డిసెంబర్ 30 : యాచారంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య రెట్టింపవుతున్నది. సాగర్ రహదారిపై ప్రైవేట్ వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక్కోసారి అంబేద్కర్ చౌరస్తాలో ఇరవై నుంచి ముప్పై నిమిషాలపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు నిత్యం నానా అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ వాహనాలైన క్రూ జర్లు, జీపులు, ఆటోలు, లారీలు, డీసీఎంలను ఎక్కడపడితే అక్కడ నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్నదని ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల నిబంధనలను తుంగలో తొక్కుతూ రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. పండుగల సమయంలో సాగర్–హైదరాబాద్ రహదారిపై వాహనాల తాకిడి ఒక్కసారిగా పెరుగుతుంది. అంతేకాకుండా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సాగర్ రహదారిపై నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతున్నది. అక్కడే కందుకూరు లింకురోడ్డు ఉండటంతో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఫలితంగా ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మాల్ మార్కెట్‌లోనూ ఇదే సమస్య తలెత్తుతున్నది. ముఖ్యంగా మద్రిగూడ రోడ్డులో ఎక్కడ పడితే అక్కడ ప్రైవేట్ వాహనాలను నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతున్నది. కనీసం బైక్‌పై వెళ్లాలన్నా అవస్థలు పడాల్సిందే. మంగళవారం వారాంతపు సంత ఉండడంతో కాలినడకన కూడా వెళ్లడం సాధ్యం కాని పరిస్థితి నెలకొన్నది. రోడ్డుపైనే సంతను నిర్వహిస్తుండడంతో ప్రయాణికుల పాలిట శాపంగా మారుతున్నది. కిక్కిరిసిన జనం, వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ స్తంభించిపోతున్నది. షాపులు, హోటళ్లు, ప్రైవేట్ కార్యాలయాల వద్ద రోడ్డు పక్కనే వాహనా లు, ఆటోలు, ద్విచక్రవాహనాలను ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. పోలీసులు అక్రమ పార్కింగ్‌లపై ఉక్కుపాదం మోపాలని, వాహనాల రాకపోకల వేగాన్ని నియంత్రించి, ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అంబేద్కర్ చౌరస్తాలో నిలిచిపోయిన వాహనాలు